బొప్పాయి పాలు.. రైతుకు లాభాలు

బొప్పాయి పంటలో వైరస్ ఎక్కువ. సీజనల్ ఇబ్బందులతో పంట దిగుబడిలో అంచనాలు తారుమారు అవుతుంటాయి. ఒక్కోసారి బొప్పాయి కాయల డిమాండ్ స్థిరంగా ఉండదు. బొప్పాయి పాలకు పెరుగుతున్న ప్రాధాన్యం రైతులను ఈ అనిశ్చితి నుంచి బయట పడేస్తోంది. బొప్పాయి పాలను ఇచ్చి రైతులు లాభాలు గడిస్తున్నారు.

- బొప్పాయి కాయలకు పాలు తీస్తున్న కూలీలు
- పాల కోసం పంటను కొంటున్న మహారాష్ట్ర వ్యాపారులు


బొప్పాయి చెట్టు కాయల నుంచి పాలు తీస్తున్న కూలీ


నిల్వ చేసిన బొప్పాయి పాలు

మండలము	బొప్పాయి సాగు ఎకరాల్లో
కోడూరు	11200
ఓబులవారిపల్లి	2462
చిట్వేలి	1890
పుల్లంపేట	650
పెనగలూరు	315

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వే కోడూరులో బొప్పాయి వ్యాపారంపై ఆధారపడి రైతులు జీవనం సాగిస్తున్నారు. బొప్పాయి పాల సేకరణకు ముంబయి, హైదరాబాద్, కోయంబత్తూరు, పుణె, బెంగళూరు, చెన్నై, విజయవాడ ప్రాంతాల వాసులు తరలివస్తున్నారు. కోడూరు మండలంలోని కోడూరు, ఓబులవారిపల్లి, చిట్వేలి, పుల్లంపేట, పెనగలూరు ప్రాంతాల్లో 17 వేల ఎకరాల్లో బొప్పాయి పంట సాగు చేశారు. ప్రస్తుతం బొప్పాయికి వైరస్ సోకడంతో దిగుబడి తగ్గిపోయింది. ఢిల్లీ, ఉత్తరప్రదేశ్‌లో గిరాకీ లేకపోవడంతో ఎగుమతులు తగ్గాయి. టన్ను ధర రూ.22 వేల నుంచి రూ.11 వేలకు పడి పోయింది. దీంతో రైతులు బొప్పాయి పాల సేకరణకు పంటను ఇచ్చేస్తున్నారు. ఈ పాలను మెడిసిన్, కెమికల్స్ తయారీకి వినియోగిస్తుండడంతో ఇతర ప్రాంతాలలో మంచి గిరాకీ ఏర్పడింది. దీంతో వ్యాపారులు ఆయా గ్రామాలను సందర్శించి వైరస్ సోకి దెబ్బతిన్న పంటను ఎకరాకు రూ.15 వేలు, పాక్షికంగా దెబ్బతిన్న పంటకు రూ.25 వేలు చెల్లించి పాలను సేకరిస్తున్నారు. కిలో పాలను రూ.100 నుంచి రూ.200కు కొంటున్నారు. ఈ పాలను ఔషధాల తయారీలో వినియోగిస్తున్నారని వారు చెబుతున్నారు.

పాలు సేకరించి ఎగుమతులు

రోజూ పది మంది కూలీలు 50 నుంచి 75 కిలోల బొప్పాయి పాలను సేకరిస్తారు. పాలను సేకరించే కూలీలకు రూ.500 నుంచి రూ.600 వరకు కూలీ ఇస్తున్నారు. పాక్షికంగా దెబ్బతిన్న ఎకరా బొప్పాయి పంట నుంచి 75 కేలోల పాలు, పూర్తిగా దెబ్బతిన్న పంట నుంచి 50 కిలోల పాలు వస్తాయి. కాయలకు బ్లేడుతో మూడు చోట్ల గాట్లు వేసి పాలు కారే సమయంలో చెట్టు కింద ప్లాస్టిక్ ప్లేటు ఏర్పాటుచేస్తారు. సేకరించిన పాలు ముద్దగా మారిపోతాయి. వాటిపై నీళ్ల చల్లి ఆ పాలను డమ్ములోకి మార్చి ఎగుమతి చేస్తున్నారు. పాలు కారాక బొప్పాయి కాయలు పనికిరాకుండా పోతాయి. రైతులు బొప్పాయి చెట్లను తొలగిస్తారు. దెబ్బతిన్న బొప్పాయి తోటల్లో పాల సేకరణతో రైతులకు ఉపశమనం కలుగుతోంది. బొప్పాయి పంట చివరి దశలో ఉన్నప్పుడు రైతుల నుండి ఎకరా 20 వేల నుండి 40 వేల రూపాయల వరకు కొనుగోలు చేసి అందులో నైపుణ్యం కలిగిన కూలీలచే చెట్టుకు ఉన్నకాయల నుండి పాలను తీస్తారు. వాటిని అన్నీ సేకరించి క్యాన్‌లలో ఉంచి 60 కేజీలయ్యాక ఎగుమతి చేసుకొని వ్యాపారస్తులు సొమ్ము చేసుకొంటారు. దీనివల్ల రైతులకు బొప్పాయి పంటపై మూడు దశల్లో ఆదాయం వచ్చే అవకాశం ఉంది. రైతు బొప్పాయి పంటను నాటిన దగ్గర నుంచి చివరి దశ వరకు కాపాడుకోగలిగితే నష్టపోకుండా ఆదాయం వచ్చే అవకాశం ఉంది.

బొప్పాయి సీజన్‌లో పనులు దొరుకుతాయి



ప్రకాశం జిల్లా నుంచి బొప్పాయి తోటల్లో పాల సేకరణ పనులకు వచ్చాం, బొప్పాయి సీజన్‌లో మాత్రమే ఈ పనులు దొరుకుతున్నాయి. మిగిలిన రోజులలో మరో పనులు చూసు కొంటున్నాం. బొప్పాయి పాలు తీసే పనికి మంచి గిరాకీ ఉంది. రోజుకు రూ.500 ఇస్తారు.

-గొర్రం పోలయ్య, కూలీ, ప్రకాశం జిల్లా

ఇతర ప్రాతాల నుంచి దిగుమతి చేస్తున్నాం



కోడూరు ప్రాంతంలో బొప్పాయి పంట చివరి దశకు వచ్చాక రైతుల నుంచి తోటను కొనుగోలు చేస్తున్నాం. కాయల నుంచి పాలు తీసి ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నాం. బొప్పాయి ధర పతన మైనప్పుడు తోటలు బాగా దొరుకుతాయి. ప్రస్తుతం కాయలు ఉండడంతో గిరాకీ ఉంది.

- ప్రవీణ్, బొప్పాయి పాల వ్యాపారి, రైల్వేకోడూరు

క్లుప్తంగా

పెనగలూరు డిప్యూటీ తహసీల్దారుగా జ్యోతి



పెనగలూరు : పెనగలూరు డిప్యూటీ తహసీల్దారుగా జ్యోతి గురువారం బాధ్యతలు చేపట్టారు. నందులూరు మండలంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తూ బదిలీపై ఆమె పెనగలూరుకు వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న మోహన్ కృష్ణ విజయవాడ సచివాలయానికి బదిలీ అయ్యారు.

అన్ని దానాల్లో కెల్లా అన్నదానం మిన్న


భోజనం ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

రాయచోటి అర్బన్ : అన్ని దానాలలోకెల్లా అన్నదానం మిన్న అని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు శివారెడ్డి అన్నారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ సభ్యుల ఆధ్వర్యంలో పట్టణ శివారులోని తాత్కాలిక గుడారాల్లో పేదలకు గురువారం భోజన ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం పుణ్య కార్యక్రమం అన్నా రు.ఈ కార్యక్రమంలో అన్నదాత యం.లోకనాథరెడ్డి, క్లబ్ ఉపాధ్యక్షుడు హరీష్ చంద్ర, సభ్యుడు పవన్ కుమార్ నాయుడు, రెడ్డికుమార్, తదితరులు పాల్గొన్నారు.

రాయచోటి వాసికి విశిష్ట సేవా పురస్కారం


విశిష్ట సేవా పురస్కారం అందుకొంటున్న వినయ్‌కుమార్

రాయచోటి టౌన్ : రాయచోటి పట్టణానికి చెందిన డాక్టర్ అబ్దుల్ కలాం యువ కెరటం ట్రస్టు డైరెక్టర్ వినయ్‌కుమార్‌కు మహాత్మాగాంధీ విశిష్ట సేవా పురస్కారం దక్కింది. నియోజకవర్గ పరిధిలో రక్తదానం, వైద్య శిబరాల నిర్వహణ, విద్యార్థులకు పోటీ పరీక్షలు, సంప్రదాయపోటీలు, తదితర కార్యక్రమాలు నిర్వహించినందుకు ఆయన ఈ పురస్కారానికి ఎంపికయ్యారు. తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ఆడిటోరియంలో సౌత్ ఇండియన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్, ఆర్‌కె కళా సాంస్కృతిక ఫౌండేషన్ నిర్వాహకులు ఆయనకు ఈ అవార్డు అందజేశారు.

ఈ నెల 6న ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక సభ

రాజంపేట రూరల్ : ఈ నెల 6న రాయచోటిలో జరిగే ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక సభను జయప్రదం చేయాలని రాష్ట్ర మాల మహానాడు ఉపాధ్యక్షుడు సంజీవ్ పిలుపునిచ్చారు. మండలంలోని పోలి, సీతారాంపురం, దళిత వాడలలో గురువారం సభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గురుమూర్తి, రెడ్డయ్య, శేఖర్, సాయి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓకు సన్మానం


ఎంపీడీఓను సన్మానిస్తున్న దృశ్యం

సుండుపల్లె : మండల ఎంపీడీవో కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ సంబేపల్లికి బదిలీ అయిన ఎంపీడీవో రామచంద్రను పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పూలమాలలు, శాలువాలతో గురువారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీనాథ్ రెడ్డి, పాల్గుణ, సురేష్‌బాబు, మహేంద్ర నాయుడు, విజయలక్ష్మి, ఆనంద్, రామ్మోహన్, ఏపీఎం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగ పొలం పరిశీలన


వేరుశనగ పొలాన్ని పరిశీలిస్తున్న బి.చంద్రనాయక్

సుండుపల్లె : మండలంలోని పుల్లారెడ్డిగారిపల్లిలోని రైతు బి.సుబ్బరాయుడు సాగు చేసిన వేరుశనగ పంట పొలాన్ని వ్యవసాయ శాఖ జేడీ బి.చంద్రనాయక్ బుధవారం పరిశీలించారు. క్షేత్రస్థాయిలో ఎర్‌ఎస్‌కే సిబ్బంది సూపర్ చెక్ రికార్డు చేసిన పంట వివరాలు తెలుసుకున్నారు. రైతులు ఈకేవైసీ త్వరగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏవో ఎస్.మహబూబ్ బాషా, వ్యవసాయాధికారి వెంకటమోహన్, ముకుంద, రైతులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి


రాజంపేట కౌన్సిల్ మీట్‌లో ఎమ్మెల్యే ఆకేపాటి, చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి

రాజంపేట : ప్రజలకు మెరుగైన సేవలందించేలా అధికారులు సమన్వయంతో పాలన సాగించాలని రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి అన్నారు. మున్సిపాల్టీ చైర్మెన్ పోలా శ్రీనివాసులురెడ్డి అధ్యక్షతన పురపాలక సంఘం కౌన్సిల్ సమావేశం గురువారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో రహదారులు, మురుగు నీటి వ్యవస్థను మెరుగుపరిచేందుకు అవసరమైన ప్రణాళిక ముందుకెళ్లాలన్నారు. కౌన్సిలర్లు తమ పరిధిలోని సమస్యలను కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలన్నారు. పట్టణాభివృద్ధికి ఎంపీ మిథున్‌రెడ్డి సహకారంతో తన వంతు కృషి చేస్తానన్నారు. మున్సిపాలిటి చైర్మన్ పోలా శ్రీనువాసులరెడ్డి మాట్లాడుతూ కౌన్సిల్ సమావేశంలో 25 అంశాలపై చర్చించి, తీర్మానాలు చేయడం జరుగుతుందన్నారు. పురపాలక నిధులలో ఒక్క పైసావృథా కారాదన్నారు. ఈ సమావేశంలో మున్సిపాలిటి వైస్ చైర్మెన్ మర్రి రవి, సుమియా, కౌన్సిలర్లు పోలా రమణారెడ్డి, కూండ్ల రమణారెడ్డి, రాముయాదవ్, పసుపులేటి సుధాకర్, తంబా సుబ్రహ్మణ్యం, అధికారులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబీకులకు పరామర్శ


నరసింహారెడ్డి కుటుంబీకులను పరామర్శిస్తున్న కొరముట్ల శ్రీనివాసులు

ఓబులవారిపల్లె : వైఎస్సార్‌సీపీ నాయకుల కుటుంబీకులను మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు గురువారం పరామర్శించారు. ఇటీవల కొమ్మూరు నరసింహారెడ్డి(40) అనారరోగ్యంతో మృతి చెందారు. ఆయన సతీమణి కొమ్మూరు సుమిత్రను ఆయన పరామర్శించి నరసింహారెడ్డి మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ సర్పంచ్ జి.సుబ్రహ్మణ్యంరెడ్డిని పరామర్శించి ఆరోగ్యం వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జైపాల్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కొమ్మూరు సుబ్బనరసారెడ్డి, కొత్తపల్లి ప్రతాప్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎం మృతి తీరని లోటు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు మండల ఏపీఎం రవికుమార్ మృతి తీరని లోటు అని మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. ఆయన మృతి వార్త తెలుసుకున్న ఆయన రవికుమార్ భౌతిక కాయాన్ని సందర్శించి మృతుడి కుటుంబీకులకు భరోసా కల్పించారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్వీ యూనివర్సిటీలో ఇద్దరూ కలిసి విద్యాభ్యాసం చేశామని, ఆయనకు మించిన సౌమ్యుడు, మిత్రులు ఇంకెవ్వరూ లేరని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి, ధ్వజారెడ్డి, రమేష్, మండల నాగేంద్ర, నందా బాల, తదితరులు పాల్గొన్నారు.

వరిలో సస్యరక్షణ చర్యలు

సిద్దవటం : వరి పంటలో సస్యరక్షణ చర్యలు సకాలంలో చేపట్టాలని బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు నాగరాజ తెలిపారు. మండలంలోని టక్కోలు రైతు సేవా కేంద్రం పరిధిలోని మంగళవాండ్లపల్లె, కడపాయపల్లె గ్రామాల్లో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజ మాట్లాడుతూ రైతు సురేష్ సాగు చేసిన వరి పంటను పరిశీలించి పాముపొడ తెగులు ఆశించినట్లు గుర్తించామన్నారు. ఈ తెగులు నివారణకు షీత్ మార్ లేదా కాసుగా మైసిన్ 2.5 మిల్లీ లీటర్ల మందు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. కాండం తొలుచు పురుగు ఆశించినందున నివారణకు ఫ్లుబెండమైడ్ 50 మిల్లీ లీటర్ల మందు లీటరు నీటితో కలిపి ఎకరా పొలంలో పిచికారీ చేసుకోవాలన్నారు. కడపాయల్లె గ్రామ రైతు వెంకటయ్య నీమస్త్రం తయారుచేశారని, అనంతరం కె.ఉక్కాయపల్లెలో కషాయాల దుకాణం ప్రారంభించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో కె.రమేష్‌రెడ్డి, వంశీ శివ ఫణీంద్ర, సునీత, చెన్నక్క, సింగరయ్య, రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు

గాలివీడు : వేరుశనగ పంటలో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏవో మురళీధర్ పేర్కొన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా గురువారం నూలివీడు, వెలిగల్లు, తూముకుంట గ్రామాల్లో సాగు చేసిన వేరుశనగ పంటకోత ప్రయోగాలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాగులో పెట్టుబడులు తగ్గించి ,పంట దిగుబడి పెంచడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ మణి, చందనప్రియ, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె : భూసార పరీక్షల ఆధారంగా రైతులు తమ పంటలో ఎరువులు వేసుకోవాలని ఏవో మల్లిక తెలిపారు. మండలంలోని ముక్కావారిపల్లి పంచాయతీతో గురువారం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. పసుపు పంటను పరిశీలించి రైతులకు సలహాలిచ్చారు. ఆమె మాట్లాడుతూ రసాయన ఎరువుల వినియోగం తగ్గించి సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని కోరారు. పశువైద్యాధికారి సురేష్ మాట్లాడుతూ మేకలు, గొర్రెలకు బీమా చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త జి.ప్రభాకర్‌రెడ్డి, బుల్లయ్య, వేణు, తదితరులు పాల్గొన్నారు.

చిట్వేలి : మండలంలోని నాగవరం, సీఎం.రాచపల్లి గ్రామాల్లో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయాధికారి సందీప్ మాట్లాడుతూ ట్రైకోడెర్మావిరిడి, ఫాస్ఫరస్ సాల్యూబొరైజ్ బ్యాక్టీరియా, పీఎస్‌బీ మందులు రాయితీపై ఇస్తున్నామని తెలిపారు. ఉద్యాన అధికారి ఆషియా మాట్లాడుతూ ప్రతి సులువైన పద్ధతిలో పంట సాగు చేసి ఖర్చు తగ్గించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ కవిత, మాజీ మార్కెట్ యార్డు చైర్మెన్ రవికుమార్ రాజు, బీటీఎం బాలసుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.


పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతున్న బద్వేల్ ఏడీఏ నాగరాజ


రైతులకు సలహాలిస్తున్న ఏవో మల్లిక

మద్యం దుకాణాల మూసివేత

లక్కిరెడ్డిపల్లి: లక్కిరెడ్డిపల్లిలో తమకు ప్రభుత్వం కేటాయించిన గడువు అక్టోబరు ఒకటో తేదీతో ముగిసిందని చెబుతూ సిబ్బంది మద్యం షాపులకు తాళం వేశారు. దీంతో మందుబాబులు దుకాణాల వద్ద పడిగాపులు కాశారు. ప్రభుత్వం నూతన మద్యం పాలసీ తీసుకురావడంతో సూపర్ వైజర్లు, సేల్స్ మెన్‌లు మద్యం విక్రయాలు చేయమంటూ అధికారులకు చెప్పేశారు. చేసేదేమీలేక వారు దుకాణాలు మూసివేశారు. జిల్లా అధికారుల చొరవతో సాయంకాలం తెరుచుకున్నాయి.

మాజీ ఉప సర్పంచ్ మృతికి సంతాపం


వీరారెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

గాలివీడు : మాజీ ఉప సర్పంచ్ తంగాల వీరారెడ్డి మృతి చెందడంతో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి గురువారం తన సంతాపం వ్యక్తం చేశారు. అనారోగ్యంతో మృతి చెందిన వీరారెడ్డి భౌతిక కాయాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి సందర్శించి నివాళి అర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మిట్టపల్లె యదుభూషన్ రెడ్డి, బండిచిన్నారెడ్డి, తంగాల వేణుగోపాల్, రమేష్ రెడ్డి, దాసరి చిన్నరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయాలకు దసరా శోభ

- వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు
- గురువారం నుంచి ప్రత్యేక పూజలు ప్రారంభం


వాసవాంబగా భక్తులకు దర్శనమిస్తున్న కన్యకాపరమేశ్వరీదేవి


పులి వాహనంపై దుర్గామాతగా ఉమామహేశ్వరీదేవి


పాత రాయచోటిలో దాక్షాయినిగా అలంకరణ

రాయచోటి టౌన్ : అమ్మలగన్నయమ్మకు ఆలయాల్లో వైభవంగా పూజలు నిర్వహిస్తున్నారు. భక్తుల సందడితో ఆలయాల్లో దసరా శోభ సంతరించుకుంది. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో భక్తులు అమ్మవారికి అభిషేకాలు, పూజలు జరిపారు. ఈ సందర్భంగా మూలమూర్తిని రంగు రంగుల పుష్పాలు, పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో వివిధ రూపాల్లో అలంకరించారు. భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి ఆలయంలో భద్రకాళీగా, కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో వాసమాంబగా, చెక్ పోస్టు వద్ద వెలసిన ఉమామహేశ్వరీదేవి అమ్మవారు దుర్గామాతగా, పాతరాయచోటిలోని అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో దాక్షాయినిగా, కొత్తపేటలో చౌడేశ్వరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

ఉప్పరపల్లెలో..


ఉప్పరపల్లెలో విజయదుర్గాదేవిగా..

సిద్దవటం : మండలంలోని ఉప్పరపల్లెలోని ఆలయంలో తొలిరోజున విజయ దుర్గాదేవి అమ్మవారిని వేద పండితుడు అమర్‌నాథ్‌శర్మ బాలా త్రిపురసుందరీ దేవిగా అలంకరించారు. అమ్మవారి మూలమూర్తికి పుత్తా రామభద్రయ్య కుమారులు పుత్తా నాగభూషణం, పుత్తా బాబు విశేష పూజలు జరిపారు.

చిన్నమండెంలో..

చిన్నమండెం : మండల కేంద్రంలో వెలసిన వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో అమ్మవారిని రాజరాజేశ్వరీదేవిగా అలంకరించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు.

అనంతంపల్లిలో..

పుల్లంపేట : అనంతంపల్లిలో నిర్మించిన ఆలయంలో దసరా ఉత్సవాలు ఘనంగా ప్రారంభించారు. శ్రీనివాసులురెడ్డి, వనజకుమారి దంపతులు మేడాలమ్మతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బంగారుపేటలో..


దీక్షా బంధనం అలంకరణలో గంగా భవాని అమ్మవారు

సిద్దవటం : మండలంలోని బంగారుపేట శివారున వెలసిన గంగా భవానీ ఆలయంలో అమ్మవారు బుధవారం దీక్షా బంధనం అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు అమ్మవారిని అభిషేకించి సహస్ర నామార్చన, దేవీఖడ్గమాల, కుంకుమార్చన జరిపారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.


ప్రత్యేక అలంకారంలో దర్శనమిస్తున్న అమ్మవారు

వీరబల్లిలో..

వీరబల్లి : మండలంలోని రాజా వీధి అమ్మవారిశాలలో మూలమూర్తికి ప్రత్యేక పూజలు జరిపి అలంకరించారు. రాత్రి భజన, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. దసరా ఉత్సవాలు పూర్తయ్యేంతవరకు ప్రత్యేక అలంకరణ, అభిషేకాలు ఉంటాయని తెలిపారు.

వెంకట్రాజంపేటలో..

రాజంపేట రూరల్ : మండలంలోని వెంకట్రాజంపేట కనకదుర్గ, ఉమామహేశ్వర ఆలయంలో గురువారం అమ్మవారిని ధనలక్ష్మీదేవి రూపంలో అలంకరించారు. భగవత పారాయణ పూజలు నిర్వహించారు.

లక్కిరెడ్డిపల్లిలో..

లక్కిరెడ్డిపల్లి : మండల కేంద్రంలో వెలిసిన సర్వమంగళాదేవి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో తొలి రోజున అమ్మవారిని బాలా త్రిపురసుందరీదేవిగా అలంకరించారు. ముందుగా అమ్మవారికి కుంకుమార్చన చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖరరెడ్డి, ఓబులేసు, గొర్లమోహన్ రెడ్డి, భూదేవమ్మ, భక్తులు పాల్గొన్నారు.

పూజారివాండ్లపల్లెలో..

గాలివీడు : మండలంలోని పూజారివాండ్లపల్లెలో వెలసిన ఇరుగులమ్మ ఆలయంలో అర్చకులు నాగ ఫణికిశోర్ శర్మ ఆధ్వర్యంలో తెల్లవారు జాము నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొదటి రోజున అమ్మవారు శైలపుత్రి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు.

నాగిరెడ్డిపల్లిలో..

నందలూరు: మండలంలోని నాగిరెడ్డిపల్లిలో వెలసిన వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి దీక్షా బంధనం అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అర్చకులు శివకుమార్ శర్మ, చెరుకుముడి మృత్యంజయశర్మ ఆధ్వర్యంలో చండీ పారాయణం నిర్వహించారు. సాయంత్రం మహిళలు సహస్ర నామ కుంకుమార్చన జరిపారు. రాత్రి ఎంబలూరు నరసింహప్రసాద్, మాకం వెంకటకుమార్, రజం రామకృష్ణయ్య దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. చలపాటి నరసింహశెట్టి, గెలివి నాగసురేంద్రకుమార్, మంచికంటి నారాయణ, గెలివి జయలక్ష్మీ, చలపాటి మాధవి, భూపాలం సునీల్‌కుమార్, పాల్గొన్నారు.

రామాపురంలో..

రామాపురం : మండలంలోని నీలకంఠ్రావుపేట వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి దీక్షాబంధనం అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి పూజలు నిర్వహించారు. దర్బారుసాయినగర్ అనంతాశ్రమంలో దర్గా మాతాజీని రాజరాజేశ్వరీ దేవిగా అలంకరించారు. భక్తులు తరలి రాగా నిర్వాహకులు అన్నదానం ఏర్పాటుచేశారు.

దసరా ఉత్సవాల్లో ఎంపీ, ఎమ్మెల్యే


రైల్వేకోడూరు అర్బన్: అమ్మవారిని దర్శించుకుటున్న ఎంపీ మిథున్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల


రాజంపేట: వాసవీ కన్యకా పరమేశ్వరిని దర్శించుకున్న ఎంపీ, ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మెన్

రైల్వేకోడూరు అర్బన్: పట్టణంలోని అమ్మవారిశాలలో జరుగుతున్న దసరా ఉత్సవాల్లో తొలి రోజున ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పాల్గొని కన్యకా పరమేశ్వరిదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారు దీక్షాబంధనం అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, సీహెచ్.రమేష్, మండల నాగేంద్ర, అన్వర్‌బాషా, అంబటి మురళి, మార్రెల్ల రాజేశ్వరి, లక్ష్మీకర్, రామచంద్రారెడ్డి, హరిక్రిష్ణ పాల్గొన్నారు.

వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో..

రాజంపేట: దసరా ఉత్సవాల్లో భాగంగా రాజంపేట ఎంపీ పీవీ.మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి , మున్సిపల్ చైర్మెన్ పోలా శ్రీనువాసులురెడ్డి పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారిని, సాధుకామాక్షమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథే సత్యం, పి.చంద్ర, సనిశెట్టి నవీన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఉప్పరపల్లిలో

రైల్వేకోడూరు అర్బన్: మండలంలోని ఉప్పరపల్లిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో అమ్మవారిని ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి దర్శించుకున్నారు. అనంతరం గ్రామస్థుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చెంగల్ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆకేపాటి భవన్‌లో కార్యకర్తలతో ఎంపీ భేటి

రైల్వేకోడూరు అర్బన్: ఆకేపాటి భవన్‌లో నియోజకవర్గంలోని కార్యకర్తలు, నేతలతో ఎంపీ పీవీ. మిథున్‌రెడ్డి భేటీ అయ్యారు. నాయకులు, కార్యకర్తలు తమ సమస్యలను తెలుపగా ఎంపీ సానుకూలంగా స్పందించారు. కార్యకర్తలుఎవరికీ భయపడనవసరంలేదని, అందరికీ తాను, ఎమ్మెల్యే అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎంపీపీలు మేడా విజయభాస్కర్‌రెడ్డి, గాలివీటి రాజేంద్రనాథ్‌రెడ్డి, గడికోట సుబ్బారెడ్డి, దాసరి పెంచలయ్య, ఇరగంరెడ్డిసుబ్బారెడ్డి, విశ్వనాథరెడ్డి, దండుగోపి, అరిగెల సౌమిత్రి, ఏకుల రాజేశ్వరి, అరిగెలనాని, సోమిశెట్టి ప్రభాకర్, దళిత నేత పెనుబాల నాగసుబ్బయ్య, కాకిచంద్ర, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఒంటిమిట్టలో శరన్నవరాత్రి ఉత్సవాలు

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట అమ్మవారి శాలలో దసరా ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. అర్చకులు ఏలేశ్వరం గురుస్వామిశర్మ గురువారం ప్రత్యేక పూజలు జరిపారు. శాస్త్రోక్తంగా పంచామృతాభిషేకం, నూతన వస్త్ర ధారణ, కనకభూషణ పుష్ప తరువులతో అలంకరణ చేశారు. కన్యకాపరమేశ్వ మాత దీక్షా బంధనం అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం సహస్ర నామార్చన, కుంకుమార్చన నిర్వహించారు. అమ్మవారిశాల అధ్యక్షుడు సోమిశెట్టి మనోహర్ బాబు మాట్లాడుతూ నవరాత్రులను భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నామని తెలిపారు.


దీక్షా బంధనం అలంకారంలో కన్యకాపరమేశ్వరి